క్లుప్తంగా

సాయిప్రదీప్‌కు సన్మానం



ఏలేశ్వరంలో సాయిప్రదీప్‌ను సన్మానిస్తున్న గోవిందు, తదితరులు

ఏలేశ్వరం: స్పార్క్స్ ఫౌండేషన్ సీఈఓ సాయిప్రదీప్ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపిక కావడంతో పట్టణంలో శనివారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి బదిరెడ్డి గోవిందు ఆధ్వర్యంలో సాయిప్రదీప్ పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ పట్టణానికి చెందిన స్పార్క్స్ సీఈఓ సాయిప్రదీప్ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సాయిప్రదీప్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. సాయిప్రదీప్ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం సాయిప్రదీప్‌కు గూగుల్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో స్పార్క్ ఫౌండేషన్ చైర్మన్ సాయిసందీప్, దేగల చంద్రమౌళి, పెంటారావు, నాగేంద్ర, లోగీసు శేఖర్, బీశెట్టి రాజా, దత్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



జగ్గంపేటలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట: నియోజకవర్గంలోని 100 మంది దివ్యాంగులకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ట్రై సైకిళ్లు సమకూర్చింది. జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద శనివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. మిగిలిన దివ్యాంగులకు వీటిని త్వరలోనే అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వంట సామగ్రి పంపిణీ



బాధితులకు వంట సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ వంట సామగ్రి సమకూర్చింది. గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరు ఇళ్లు కాలిబూడిదైన సంగతి తెలిసిందే. బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ సమకూర్చిన సామగ్రిని శనివారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందజేశారు. వీటితో పాటు బాధితులకు ప్రభుత్వ పరంగా స్మార్ట్ రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకాల పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, రెవెన్యూ ఇనస్పెక్టర్ ఎ. గోపాలకృష్ణ, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతారాముడు, మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



విద్యార్థినులకు మునగాకు పొడిని పంపిణీ చేస్తున్న డాక్టర్ నిఖిత

గోకవరం: మండలంలోని కామరాజుపేట బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ నిఖిత విద్యార్థినులను పరీక్షించి రక్తహీనత కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. అలాగే రక్తహీనత బారిన పడకుండా ఉండేందుకు వారికి మునగాకు పొడిని (మురింగా) పంపిణీ చేశారు. దీనిని ప్రతీరోజు ఆహారంలో తీసుకోవడం వలన బాలికలు రక్త హీనత బారినపడకుండా ఉంటారని, విద్యార్థినులు విధిగా ఈ పొడిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ జ్యోతి, ఎంఎల్‌హెచ్‌పీ వినోలియా, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు సమస్యల వెల్లువ

తుని: పట్టణంలో సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్యకు ఫిర్యాదు చేశారు. శనివారం తుని పట్టణం సీతారాంపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. స్థానిక బీఎంపీ కర్రెళ్ల గణపతిరావు విద్యుత్ కోతలు, అధిక బిల్లులు, పారిశుధ్యం, కోతులు, కుక్కల దాడులు తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజాదర్బారుకు వచ్చిన సమస్యలను నిర్ణిత వ్యవధిలో పరిష్కరించాలని ఎమ్మెల్యే దివ్య ఆదేశించారు.

కొరికి పడేస్తాయ్ !

- వరి పంటపై ఎలుకల దాడి
- దిగుబడులు నష్టపోతున్న అన్నదాతలు
- సామూహిక ఎలుకల నివారణతో మంచి ఫలితాలు
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న అధికారులు



జగన్నాథపురంలో సామూహిక ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోటనందూరు: ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ వరిసాగు ఈ ఏడాది ఆలస్యమైంది. దీంతో కలుపు, తెగుళ్ల బెడదతో పాటు ఎలుకల దాడి కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎలుకలు పంటను వివిధ దశల్లో పాడు చేసి దిగుబడులకు భారీ నష్టం కలిగించే ప్రమాదం పొంచి ఉంది. పుష్కలంగా నీటి లభ్యత, కలుపు ఉన్న చోట ఎలుకల బెడద ఎక్కువగా ఉంటోంది. సకాలంలో రైతులు సామూహికంగా ఎలుకల నివారణ మందును వినియోగిస్తే ఎలుకల బెడద నుంచి గట్టెక్కి మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

40 వేల ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది తుని సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 40 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ విస్తీర్ణంలో సుమారుగా 5 వేల టన్నుల దిగుబడికి ఎలుకల వల్ల నష్టం వాటిల్లుతుందని అంచనా. సాగునీటి లభ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, వెడల్పు గట్లపై కలుపు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎలుకలు పంటకు నష్టం కలిగిస్తున్నాయి.

పిలకలు పెట్టే దశలో..

వరి పంట పిలకలు వేసే సమయంలో ఎలుకలు 5–10 సెంటీమీటర్ల ఎత్తులో కొరికేస్తాయి. ఎలుకలు పిలకలను తినడం కంటే కొరకడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాయి. దానికి కారణం వాటికి రెండు జతల కొరికే దంతాలు ఉంటాయి. ఆ దంతాలు రోజూ 0.4 సెంటీమీటర్ల చొప్పున పెరుగుతూ ఉంటాయి. వాటిని అరగదీసుకునే ప్రయత్నంలో భాగంగా పంటను పాటు చేస్తుంటాయి. వరిలో పిలకలు వేసే సమయంలో ఎలుకల సంతానోత్పత్తి కూడా ఎక్కువగా ఉండి పంటకు భారీ నష్టం కలిగిస్తాయి.

చిరుపొట్ట దశలో..

చిరుపొట్ట దశలో ఎలుక చేసే నష్టం చాలా కీలకం. వరి దుబ్బులను గట్ల వెంబడే కాకుండా పంట మధ్యలో కూడా కొరికి నష్టం కలిగిస్తాయి. దీని వల్ల అక్కడక్కడ ఖాళీలు కనిపిస్తాయి. పంట పాలుపోసుకున్న తరువాత బొరియల్లో ధాన్యపు గింజలను నిల్వ చేయడం ద్వారా కూడా నష్టం కలిగిస్తాయి. ఇలా ఎకరాకు రెండు నుంచి మూడు బస్తాల వరకూ నష్టాన్ని కలిగిస్తాయి.

ఎలుకలకు అనుకూల పరిస్థితులు

కాలువల కింద పండించే వరి పంటలో ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. నిరంతర ఆహారం, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాలు, సాగునీటి కాలువలు, ఉద్యాన పంటలైన కొబ్బరి, కోకో, ఆయిల్‌పామ్ తోటలను ఆనుకొని సాగు చేసే పంట ప్రాంతాల్లో ఎలుకల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

రైతులకు ఉచితంగా ఎలుకల నివారణ మందు



ఎలుకలను పూర్తి స్థాయిలో అరికట్టాలంటే రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణ మందును వినియోగించాలి. పొలం గట్లు వెడల్పు తగ్గించి కలుపు లేకుండా చూసుకుంటే ఎలుకల సమస్య ఉండదు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచితంగా ఎలుకల నివారణ మందును సరఫరా చేస్తుంది. ఎలుకల నివారణలో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి.

కేజే చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, కోటనందూరు

సమగ్ర యాజమాన్యంతో నివారణ

ఎలుకల నివారణకు సేద్య, భౌతిక, యాంత్రిక, పొగబారించడం వంటి అనేక పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ తక్కువ ఖర్చుతో ఎలుకలను నివారించేందుకు రసాయనిక పద్ధతిలో ప్రభుత్వం సామూహిక ఎలుకల నివారణను ప్రోత్సహిస్తోంది. ఈ విధానంపై రైతులలో అవగాహన కల్పిస్తూ ఉచితంగా ఎలుకల నివారణ మందును అందజేస్తోంది.

బ్రోమోడయోలిన్ మందు తయారీ

ఒక కేజీ బ్రోమోడయోలిన్ మందు తయారీకి 960 గ్రాముల నూకలు, రెండు గ్రాములు బ్రోమోడయోల్ మందు, రెండు గ్రాముల నూనె చొప్పున కలిపి మిశ్రమం చేయాలి. అలా చేసిన మిశ్రమాన్ని ఒక ప్రాంత రైతులంతా సామూహికంగా ఎలుక బొరియల్లో పెట్టడం ద్వారా ఎలుకలను నివారించుకోవచ్చు. ఎకరానికి కేజీ చొప్పున 1, 11 రోజుల వ్యవధిలో మందును ఎలుకల బొరియల్లో పెట్టాలి.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



చినశంకర్లపూడిలో ఎంపీటీసీ పిల్లా చిన్నను పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, కిత్తమూరిపేట, చినశంకర్లపూడి గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు శనివారం పరామర్శించారు. రెండు కుటుంబాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కిత్తమూరిపేటకు చెందిన మాజీ ఎంపీటీసీ భూముల నూకాలమ్మ మామయ్య ఇటీవల మృతి చెందారు. చిన్నశంకర్లపూడిలో ఎంపీటీసీ పిల్లా చిన్న తల్లి మణెమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను మురళీకృష్ణంరాజు పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. అలాగే పెద్దిపాలేనికి చెందిన రాళ్ల అప్పారావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఆయనను మురళీకృష్ణంరాజు పరామర్శించి రూ.ఐదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కిత్తమూరుపేటకు చెందిన కార్యం అర్జునుడుకి రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమైంది. ఆయనను పరామర్శించి ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు మాకా చంటిబాబు, లొండ బాబు, విత్తనాల నాగేశ్వరరావు, నానిపల్లి చంటి, కోనా బాబ్జి, దాడి పుత్తయ్య, దెందుకూరి హరిరాజు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ



గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకుంటున్న జగ్గంపేట విద్యార్థి యశ్విన్



పెరుమాళ్లపురంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

జగ్గంపేట: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జగ్గంపేట విద్యార్థి బంగారు పతకం సాధించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 29 తేదిన పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జగ్గంపేటకు చెందిన విద్యార్థి యం.యశ్విన్ 93 కేజీల విభాగంలో విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ బి.కన్నారావు తెలిపారు. అలాగే ఎం.రేవంత్, మద్దాల సృజన్ 66 కేజీల విభాగంలో ప్రతిభ చూపి నాలుగో స్థానంలో నిలిచారన్నారు. బంగారు పతకం సాధించిన యశ్విన్‌ను స్థానిక నేతలు, కోచ్ కన్నారావు అభినందించారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తొండంగి: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ పీఆర్ కళాశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ శనివారం తెలిపారు. అథ్లెటిక్స్ విభాగంలో ఎస్.ఉమామహేశ్వరరావు సిల్వర్ మెడల్, లాంగ్‌జంప్‌లో ఎ.శ్రీనుబాబు బ్రాంజ్ మెడల్‌ను సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అధ్యాపకులు పీవీ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, డాక్టర్ పి.దివాకర్‌రావు, కేఎస్‌బీ విజయ్‌కుమార్, వెంకటేశులు, నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

బాబు మోసాలను ప్రజలకు వివరించాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

రౌతులపూడి: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. పార్టీ నేత వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో రౌతులపూడిలో ×బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ×పై శనివారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాల్లో సగానికి పైగా కోతలు విధించి పేద ప్రజల నడ్డివిరిచారని మండిపడ్డారు. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులకు పూర్తిస్థాయిలో యూరియా ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలన్నారు. నియోజకవర్గ ప్రజలు చేసిన పూజలు, చూపిన ప్రేమాభిమానాలతో తన తండ్రి ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ఇంటికి చేరుకున్నారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్న చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి అన్నారు. ప్రజల అండదండలతో జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, గిరిబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ బేనర్‌లను ఆవిష్కరించారు. గజమాలతో పార్టీశ్రేణులు గిరిబాబును సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేతలు వాసిరెడ్డి భాస్కర బాబు, సాయి, పులి మధు, గొల్లు వెంకటరమణ, చెన్నాడ సత్తిబాబు, సర్పంం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ బేనర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిబాబు, నాయకులు

విద్యార్థులు భాషపై అవగాహన పెంచుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బీవీపీ ప్రతినిధులు

తుని: విద్యార్థులు భాషపై అవగాహన పెంచుకోవాలని చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు సూచించారు. స్థానిక మర్చంట్ అసోసియేషన్ భవనంలో శనివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జాతయ బృందగాన పోటీలు నిర్వహించారు. సంస్కృతం, హిందీ విభాగాల్లో తుని, పాయకరావుపేట శ్రీప్రకాష్‌కు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి కలిదిండి సత్యనారాయణరాజు, ఎంపీఎస్ రాజు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతులుగా అమీనా సాహెబ్, సత్యవేణి వ్యవహరించారు. కార్యక్రమంలో బీవీపీ అధ్యక్షుడు వేణుగోపాలస్వామి, చదరం శివాజీ, నాగేశ్వరరావు, రాజబాబు, ప్రసాద్, శివకుమార్, ఆసిన సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏడుకొండలుకు అభినందనలు



గుల్లా ఏడుకొండలు (ఫైల్)

గోకవరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుల్లా ఏడుకొండలును పార్టీ నాయకులు అభినందించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా ఇటీవల ఆయన నియమితులయ్యారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన గతంలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి పదవులు నిర్వహించారు. ఆయనకు ఈ పదవి లభించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పటిష్టతకు తోడ్పడతానని గుల్లా ఏడుకొండలు తెలిపారు.

అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి



ఉల్లాస్ శిక్షణ తరగతులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఎంపీడీఓ కుమార్ బాబు



శంఖవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న అక్షర ఆంధ్రా లిటరసీ వలంటీర్లు

ప్రత్తిపాడు: అక్షరాస్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు అన్నారు. ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన వలంటీర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్ బాబు మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యంగా వలంటీర్లు కృషి చేయాలన్నారు. మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతగా 2,500 మంది నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. వీరిలో 1,000 మందిని డ్వామా సిబ్బంది, 1,500 మందిని డీఆర్‌డీఏ సిబ్బంది గుర్తించారన్నారు. వీరికి చదువు చెప్పేందుకు పది మందికి ఒకరు వంతున 250 వలంటీర్లను నియమించామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూనిటీ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు నిరక్షరాస్యులకు శిక్షణ ఇస్తారని చెప్పారు. శిక్షణకు మాస్టర్ ట్రైనీగా ఎం.రాజబాబు వ్యవహరించారు. డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామి, వెలుగు ఏపీఎం జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: నిరక్షరాస్యులు విద్యను అభ్యసించాలని ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అక్షర ఆంధ్రా లిటరసీ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నిరక్షరాస్యులకు సాయంత్రం రెండు గంటల పాటు విద్యను అందించాలన్నారు. వలంటీర్లు సేవా దృక్పదంతో నిరక్షరాస్యులకు విద్యను అందించాలని సూచించారు.

బాల్య వివాహాలతో నష్టం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి గోపినాథ్

ఏలేశ్వరం: బాల్య వివాహాలతో నష్టం కలుగుతుందని ప్రత్తిపాడు జూనియర్ సివిల్ జడ్జి లంక గోపినాథ్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం బాల్యవివాహాలు, కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ జడ్జి గోపినాథ్ మాట్లాడుతూ బాల్యంలో వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఇటువంటి వివాహాల ద్వారా బాలికలు మానసికంగా నష్టపోతారన్నారు. చిన్న వయస్సులో గర్భం దాల్చడం ద్వారా శిశు, మాతృ మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు బాల్యవివాహాలను అరికట్టాలని కోరారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ, న్యాయవాదులు బుగతా శివ, చిట్టంశెట్టి పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు వేధింపులు

ఏలేశ్వరం: ఏలేరు ప్రాజెక్టులో నిషేధ సమయంలో వేట కొనసాగించాలని మత్స్యకారులను కొందరు వేధింపులకు గురి చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకూ గడువు ఉంది. కాగా మర్రివీడు సమీపంలోని ఏలేరు ప్రాజెక్టులో వేట కొనసాగించాలని మతబోధకుడు ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. మత్స్యకారులను రాత్రి వేళల్లో వేటకు పంపడమే కాకుండా కేజీ చొప్పున కమిషన్ వసూలు చేస్తున్నట్టు తెలిసింది. నిషేధం లేని సమయంలోనూ మత్స్యకారుల వద్ద కమిషన్ వ్యాపారం చేస్తూ తాను టీడీపీ పార్టీ సభ్యుడినని బెదిరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

రైతులకు యూరియా పంపిణీ

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో రైతులకు శనివారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా ఎరువుల కొరతతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకూ 380 టన్నుల యూరియా రైతులకు అందజేసినట్టు మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వెయిటింగ్ హాల్ ప్రారంభం



పెరుమాళ్లపురం పీహెచ్‌సీలో వెయిటింగ్ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒంటిమామిడి దివీస్ ల్యాబోరేటరీస్ ఆర్థిక సహకారంతో నిర్మించిన వైద్యుల సంప్రదింపుల గది, వెయిటింగ్ హాల్‌ను దివీస్ సంస్థ సీనియర్ మేనేజర్ ఆర్.సుధాకర్ శనివారం ప్రారంభించారు. దివీస్ సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.11.25 లక్షలతో రోగులకు వైద్య సేవల కోసం డాక్టర్‌ను సంప్రదించేందుకు వీలుగా గదితో పాటు రోగులకు వేచి ఉండే హాలు నిర్మించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ రోగుల సౌకర్యార్థం ఆస్పత్రిలో నూతన భవనాన్ని నిర్మించామన్నారు. రోగులు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ ప్రతినిధి బి.వాసుబాబు. కె.తేజ, ఎస్.బాలకృష్ణ, ఆస్పత్రి వైద్యురాలు లక్ష్మీప్రసన్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం



ఏలేశ్వరంలో పారాయణ పఠనం చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని లక్ష్మీగణపతి ఆలయం వద్ద శనివారం రాత్రి దీపోత్సవం నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యురాలు జ్యోతినరసింహం ఆధ్వర్యంలో మహిళలు పలు పారాయణలు పఠించారు. మహిళలు గణపతి సహస్రనామాలతో పాటు భగవద్గీత పఠనం చేశారు. తొలుత గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, తూముగొతు గురయ్య, వుడతల రమణరావు మహిళలు పాల్గొన్నారు.

లింగంపర్తిలో అన్నదానం

వినాయక చవితి వేడుకల్లో భాగంగా లింగంపర్తిలో శనివారం అన్నదానం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, నీటి సంఘం అధ్యక్షుడు ఎస్‌జీవీ సుబ్బరాజు, నూకతాటి ఈశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు వేమవరంలో అన్నసమారాధన

తొండంగి: మండలంలోని కోన తీరప్రాంతం వేమవరంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు సిద్ధి వినాయక యూత్ సభ్యులు శనివారం తెలిపారు. గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు, దాతల సహకారంతో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం భారీ అన్నదానం నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు

ప్రత్తిపాడు: స్థానిక పంచాయతీ వెనుక నెలకొల్పిన తంత్ర గణపతి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, లక్ష్మీగణపతి, మహాలక్ష్మి, నక్షత్ర, మహాసౌర, నవగ్రహ, రుద్ర, సుబ్రహ్మణ్య, వాస్తు, మృత్యుంజయ తదితర హోమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తంత్ర గణపతిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్‌ఆర్ పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజు వర్మ, కొట్టేటి అప్పారావు, ఉమా శంకర్ పాల్గొన్నారు.

ఉద్యమ నేత సోమరాజు మృతికి సంతాపం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని కిత్తమూరిపేటకు చెందిన భూస్వామ్య వ్యతిరేక ఉద్యమనేత భూముల సోమరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు, ఆదివాసీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు తదితరులు పరామర్శించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.